సీఎం జగన్ పేదల పక్షపాతి

- ఎంపీ, వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ



లీలాసుందరినగర్‌లో మహిళతో మాట్లాడి సమస్యలు తెలుసుకుంటున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

ఆరిలోవ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదల పక్షపాతి అని విశాఖ ఎంపీ, వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. జీవీఎంసీ 12వ వార్డులో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ అక్కరమాని రోహిణి, వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు, సచివాలయం సిబ్బంది, కన్వీనర్లతో కలిసి ఆయన లీలాసుందరినగర్‌లో ఇంటింటికీ వెళ్లారు. సంక్షేమ పథకాల కరపత్రాలను అందించారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో ఎలాంటి లబ్ధి పొందుతున్నారు..?, ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పరిపాలన ఏ విధంగా ఉందో అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలు పేదలకు మేలు చేస్తున్నాయన్నారు. ముఖ్యమంత్రికి రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లలాంటివన్నారు. ఏపీ మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ పేర్ల విజయచందర్, తూర్పు నియోజకవర్గం ఎన్నికల పరిశీలకుడు మొల్లి అప్పారావు, వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు సత్తి మందారెడ్డి, కన్నేటి సుబ్బారెడ్డి, చొక్కర శేఖర్, బోని శివరామకృష్ణ, బారాజు, సూర్యారావు, హుస్సేన్, మోహన్, శ్రీను, సుజాత, సచివాలయం కన్వీనర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సహాయనిధి అందజేత

ఎంవీపీ కాలనీ: వాసవానిపాలెంలో లబ్ధిదారుకు వైఎస్సార్ సహాయనిధి నగదు ఎంపీ, వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ శనివారం అందజేశారు. జీవీఎంసీ 18వ వార్డు వాసవానిపాలెంకు చెందిన డి.ధర్మారావు (40) ఇటీవల ఓ ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో ఎంపీ చొరవ తీసుకుని సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాలతో వైఎస్సార్ సహాయనిధి ద్వారా రూ.5 లక్షల ఆర్థిక సాయాన్ని మంజూరు చేయించారు. ఈ సందర్భంగా ఆ ఆర్థిక సాయాన్ని పార్టీ నాయకుల సమక్షంలో ధర్మారావు కుటుంబ సభ్యులకు ఎంవీవీ అందజేశారు. ప్రభుత్వం తరపున అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ 18వ వార్డు ఇన్‌చార్జి పుక్కళ్ల ధనలక్ష్మి, పేర్ల విజయచందర్ తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారుకు చెక్కు అందజేస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

నేడూ నాక్ బృందం పర్యటన

వర్సిటీ ప్రగతి ఆవిష్కరణకు ఏర్పాట్లు



ఏయూ గ్రంథాలయం



దివ్యాంగులకు ప్రత్యేక విభాగం



గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో గత ఐదు సంవత్సరాల్లో సాధించిన ప్రగతిని నాక్ కమిటీ ముందు ఆవిష్కరిస్తున్నారు. తొలి రోజు కమిటీ పర్యటన ఎంతో సంతృప్తికరంగా సాగింది. ఆదివారం ఉదయం కమిటీ సభ్యులు మరిన్ని విభాగాలు, పరిశోధన కేంద్రాలను సంర్శించే అవకాశం ఉంది. దీనికి అనుగుణంగా అధికారులు ఇప్పటికే ఏర్పాట్లు చేశారు. ప్రతీ విభాగంలో జరుగుతున్న కార్యక్రమాలు, ప్రగతిని ఆవిష్కరించే ప్రయత్నం చేశారు.

తలమానికంగా గ్రంథాలయం

నాక్ కమిటీ సందర్శించే ప్రధాన విభాగాల్లో ఒకటి గ్రంథాలయం. దీన్ని అవసరమైన విధంగా ఇప్పటికే సిద్ధం చేశారు. పూర్తిస్థాయిలో గ్రంథాలయంలో వసతులు కల్పించి ఆధునీకీకరించారు. విద్యార్థులకు ఉపయుక్తంగా నిలిచే రీడింగ్ రూమ్, ఇ – లెర్నింగ్ సెంటర్, డిజిటల్ లైబ్రరీ పూర్తి స్థాయిలో సేవలు అందిస్తున్నాయి. గ్రంథాలయంలో దశాబ్దాలుగా భద్రపరిచిన తాళపత్ర గ్రంథాలు, ఆన్‌లైన్ వెబ్‌బేస్డ్ డిజిటల్ సర్వీస్ సెంటర్, అరుదైన గ్రంథాల పుస్తక ప్రదర్శన నాక్ కమిటీ సభ్యులకు వివరిస్తారు. అదేవిధంగా ఏయూ పరిశోధన గ్రంథాల డిజిటలైజేషన్, డిజిటల్ సేవలు అందిస్తున్న సేవలు కమిటీ సభ్యులకు వివరిస్తారు.

మరిన్ని విభాగాల సందర్శన

ఆదివారం నాక్ కమిటీ మరిన్ని విభాగాలను సందర్శిస్తుంది. ఈ నేపథ్యంలో వర్సిటీ పూర్తిస్థాయిలో పనిచేస్తుంది. అన్ని విభాగాలు పూర్తిస్థాయిలో సేవలు అందిస్తాయి. క్రీడా విభాగం, ఏయూ – లూక్స్ స్టూడియో, యోగా విభాగంతోపాటు వర్సిటీలో విద్యార్థులకు ఉపయుక్తంగా అందిస్తున్న పలు సేవలు తదితర అంశాలను కమిటీ సభ్యులు పరిశీలిస్తారు. ఏయూలో పలు పరిశోధన కేంద్రాలను సైతం కమిటీ సభ్యులు సందర్శిస్తారు.

క్లుప్తంగా

మహిళా క్రికెట్ జట్టుకు ఏయూ విద్యార్థినుల ఎంపిక



ఎంపికైన విద్యార్థినులు

ఏయూ క్యాంపస్ : ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ రాష్ట్ర అండర్–15 మహిళా క్రికెట్ జట్టుకు ఏయూ ఆంగ్ల మాధ్యమం విద్యార్థినులు పి.వి.ఎల్.ఎస్. పరిమళ, పి.జె. గాయిత్రి ఎంపికయ్యారు. వీరిద్దరు ఏయూ ఆంగ్ల మాధ్యమం పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులను పాఠశాల కరస్పాండెంట్ ఆచార్య కె.సమత, ప్రిన్సిపాల్ సుధారాణి, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు. క్రీడల్లో రాణించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.

షూటింగ్ చాంపియన్‌షిప్‌లో క్రీడాకారుల ప్రతిభ



పతకాలు సాధించిన క్రీడాకారులు

ఎంవీపీ కాలనీ : అంతర్జాతీయ క్రాస్ బౌ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో నగర క్రీడాకారులు ప్రతిభ చాటారు. ఎంవీపీ కాలనీలోని భారత్ షూటింగ్ అకాడమీ ద్వారా శిక్షణ పొందుతున్న వీరు ఆగ్రాలో జరిగిన ఛాంపియన్‌షిప్‌లో పెద్ద సంఖ్యలో పతకాలు సాధించారు. 11 మంది ఈ టోర్నీలో పాల్గొనగా 18 పతకాల సాధించినట్లు శనివారం అకాడమీ ప్రతినిధులు వెల్లడించారు. ఇందులో 9 బంగారు, 5 వెండి, 4 రజత పతకాలు ఉన్నట్లు తెలిపారు. ఆయా క్రీడాకారులంతా నగరంలోని పలు పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా వారికి పలువురు అభినందనలు తెలిపారు.

విజిలెన్స్ వారోత్సవాల నిర్వహణ



యువతకు సర్టిఫికెట్లు అందజేస్తున్న మోహన్

సీతమ్మధార : అవినీతి నిరోధక వారోత్సవాల్లో భాగంగా శనివారం ద్వారకానగర్, డొండపర్తి రోడ్డులోని పలు ప్రాంతాల్లో విజిలెన్స్ అధికారుల సంచార వాహనం ద్వారా ప్రజలకు అవగహన కల్పించారు. ఈ సందర్భంగా యువతకు కె.మోహన్ సర్టిఫికెట్లు అందజేశారు.

నీలమ్మ హుండీ ఆదాయం రూ.2.43 లక్షలు



నగదు లెక్కిస్తున్న శ్రీ హరి సేవా సంఘం సభ్యులు

అల్లిపురం : అస్సాం గార్డెన్స్‌లో వెలసిన నీలమ్మ వేపచెట్టు అమ్మవారికి రూ.2,43,062 హుండీ ఆదాయం లభించిందని ఆలయ ఈవో రమాభాయ్, ట్రస్ట్‌బోర్డు చైర్‌పర్సన్ బొర్రా విజయలక్ష్మి తెలిపారు. ఈ మొత్తం మూడు నెలలకు గాను లభించిందన్నారు. శనివారం దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, ఈవో రమాభాయ్, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యుల సమక్షంలో హుండీలు తెరిచారు. శ్రీహరి సేవా సంఘం సభ్యులు పాల్గొని లెక్కింపు చేపట్టారు. కార్యక్రమంలో ట్రస్ట్ బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

పలుచోట్ల భక్తులకు అన్నసంతర్పణ



అన్నప్రసాదం వడ్డిస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ తదితరులు

మద్దిలపాలెం: శరన్నవరాత్రి ఉత్సవాలో భాగంగా శనివారం జీవీఎంసీ 16వ వార్డులో పాత వెంకోజీపాలెంలో రాధాకృష్ణ యాదవ సేవా సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మొల్లి లక్ష్మి, ముమ్మల లక్ష్మి, పల్లా అప్పలకొండ, ఏపీఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావు, ఏపీ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పీతల గోవింద్ పాల్గొన్ని భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు జోగా నూకరాజు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మాలధారులకు అన్నదానం

మద్దిలపాలెం : మాల ధరించి దీక్షలో ఉన్న స్వాములకు మండల కాలం నిత్య అన్నదాన కార్యక్రమం కొత్త వెంకోజీపాలెంలోని శ్రీ గౌరీ జ్ఞానలింగేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రారంభించారు. కొత్త వెంకోజీపాలెం గ్రామ సేవ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వాములకు భిక్ష వడ్డన చేశారు. నిత్య అన్నదాన కార్యక్రమం డిసెంబర్ 15వ తేదీ వరకూ కొనసాగుతుందని సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు.

ఓటర్ల జాబితా పరిశీలన

బీచ్‌రోడ్డు : కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా పరిశీలన కార్యక్రమం శనివారం జీవీఎంసీ 21, 28 వార్డుల్లో కొనసాగింది. బూత్ లెవల్ అధికారులు ఇంటింటికీ వెళ్లి ఓటర్లను పరిశీలించారు. మరణించినవారు.. డబుల్ ఓట్లను గుర్తించటంతో పాటు అర్హత ఉన్న వారి పేర్లను నమోదు చేసుకున్నారు.

శరవేగంగా సీసీ రోడ్డు నిర్మాణం



రోడ్డు పరిశీలిస్తున్న పీతల గోవింద్

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 22వ వార్డులో మంగాపురం కాలనీ, చర్చి వీధి మధ్య 100 మీటర్ల పొడవు గల సీసీ రోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. పనులను పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పీతల గోవింద్, జీవీఎంసీ అధికారులు శనివారం పరిశీలించారు.

న్యాయ కళాశాలకు ఏసీ బహూకరణ



ప్రిన్సిపాల్‌కి ఏసీ అందిస్తున్న పృథ్వీరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ న్యాయ కళాశాల ఎల్ఎల్‌బీ చివరి సంవత్సరం విద్యార్థి దాసరి పృథ్వీరెడ్డి నూతన ఏసీ బహూకరించారు. ఏయూ న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వి.విజయలక్ష్మిని శనివారం కార్యాలయంలో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఆచార్య వి.విజయలక్ష్మి మాట్లాడుతూ ఏయూ న్యాయ కళాశాల ఎందరో న్యాయ కోవిదులను, రాజకీయ నాయకులను దేశానికి అందించిందన్నారు. విద్యార్థులు, పూర్వ విద్యార్థులు కళాశాల అభివృద్ధిని కాంక్షిస్తూ పనిచేయడం సంతోషకరమన్నారు.

మొల్లి అప్పారావుకు పలువురి అభినందన



మొల్లి అప్పారావును అభినందిస్తున్న బీసీ సంఘం నాయకులు

ఎంవీపీకాలనీ : వైఎస్సార్‌సీపీ నాయకుడు మొల్లి అప్పారావు విశాఖ తూర్పు నియోజకవర్గ పరిశీలకుడిగా నియమితులైన సందర్భంగా రాష్ట్ర బీసీ సంఘం నాయకులతో పాటు పలువురు అభినందనలు తెలిపారు. ప్రస్తుతం ఏపీఐఐసీ డైరెక్టర్‌గా ఉన్న ఆయన బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడిగా కూడా సేవలందిస్తున్నారు. ఈ నేపథ్యంలో బీసీ సంఘం రాష్ట్ర కన్వీనర్ పితాని ప్రసాద్‌తో పాటు మడికి నరేష్‌కుమార్, చిలకమర్రి విజయ్ తదితరులు శనివారం ఆయనకి అభినందనలు తెలిపారు. ఆయనకు వైఎస్సార్‌సీపీలో మరింత గుర్తింపు కల్పించడం పట్ల ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి, రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఎంపీ కార్యాలయంలో..

విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ పార్టీ తూర్పు నియోజకవర్గ పరిశీలకుడిగా నియమితులైన మొల్లి అప్పారావును సత్కరించారు. లాసన్స్ బే కాలనీలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఈ కార్యక్రమం జరిగింది. కార్పొరేటర్లు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు. 2024 ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా సేవలందిచాలని ఎంపీ సూచించారు.

విమ్స్‌లో సెంట్రల్ డ్రగ్స్ స్టోరేజ్ భవనం సిద్ధం



విమ్స్‌లో నిర్మాణంలో ఉన్న సిటీ డయాగ్నోస్టిక్ సెంటర్ భవనం

ఆరిలోవ : విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్)లో సెంట్రల్ డ్రగ్స్ స్టోరేజ్, సిటీ డయాగ్నొస్టిక్ సెంటర్ భవనం సిద్ధమవుతోంది. సుమారు రెండేళ్ల క్రితం విమ్స్ ఆవరణలో దీని నిర్మాణం ప్రారంభించారు. అప్పటి నుంచి జరగుతున్న నిర్మాణ పనులు కొద్ది రోజులుగా వేగం పుంజుకున్నాయి. ఇటీవల వైద్య విభాగం అధికారులు ఈ నిర్మాణంపై దృష్టి పెట్టారు. తొందరగా పనులు జరిపించి వినియోగంలోకి తీసుకురావడానికి సిద్ధమవుతున్నారు. అరెకరం స్థలంలో ఈ నిర్మాణం చేపట్టారు. దీనికి రూ.20 కోట్లు ఖర్చు చేస్తున్నారు. ప్రస్తుతం భవనానికి రంగులు వేస్తున్నారు. అన్ని పనులు పూర్తయిన వెంటనే కొద్ది రోజుల్లో దీన్ని వినియోగంలోకి తీసుకురానున్నట్లు విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు తెలిపారు.

విశేషంగా నిత్య కల్యాణం



తలంబ్రాలు ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ ఎంవీవీ, మేయర్ హరి వెంకటకుమారి

మద్దిలపాలెం : జీవీఎంసీ 16వ వార్డులో పలు అభివృద్ధి పనులకు సంబంధించి శనివారం ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ, మేయర్ గొలగాని హరి వెంకట కుమారి స్థానిక కార్పొరేటర్ గుడ్ల విజయసాయి, వార్డు ఇన్‌చార్జి గుడ్ల సత్యారెడ్డితో కలిసి శంకుస్థాపనలు చేశారు. వార్డులో మద్దిలపాలెం, శివాలయం వీధిలో కాలువలు, సీసీ రోడ్డు నిర్మాణానికి రూ. 33 లక్షలు మంజూరయ్యాయని కార్పొరేటర్ విజయసాయి తెలిపారు. జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గాయత్రీ మంత్ర జప యజ్ఞంతో సనాతన ధర్మ వ్యాప్తి



మంత్ర జప యజ్ఞం నిర్వహిస్తున్న సంధ్యోపాసకులు

డాబాగార్డెన్స్ : లోక కల్యాణార్థం విశ్వశాంతిని కాంక్షిస్తూ కల్వకొలను చిత్తరంజన్‌దాస్ స్మారక సేవా సంస్థ ఆధ్వర్యంలో శతకోటి గాయత్రీ మంత్ర జప యజ్ఞం నిర్వహిస్తున్నామని సంస్థ ప్రతినిధి కల్వకొలను శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. దీనిలో భాగంగానే శనివారం మహారాణిపేటలో గల అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి ఆలయ ప్రాంగణ వేదికగా సామూహిక గాయత్రీ మంత్ర హవనం, పూర్ణాహుతి నిర్వహించినట్టు చెప్పారు. శతకోటి గాయత్రీ మంత్ర జప యజ్ఞంలో 3 వేల మంది నిత్యం సంధ్యోపాసకులు జపం చేస్తున్నారని, దేవీ భాగవత అనుసారంగా జరుగుతున్న శతకోటి గాయత్రీ మంత్ర జప యజ్ఞానికి పంచాహ్నిక దీక్ష, సహస్రాధిక రుత్వికులు చతుర్వింశాత్మక కుండ హవనం, మండపారాధనలు, దీక్షాధారణలు, సీతా రామకల్యాణ మహోత్సవం, శ్రీరామ పట్టాభిషేక మహోత్సవం, సాధూ సమ్మేళనం, మహాపూర్ణాహుతి కార్యక్రమాలు గత నెల 27 నుంచి 31 వరకు ఉత్తరప్రదేశ్ అయోధ్యపురిలో వైభవంగా నిర్వహించినట్లు తెలిపారు. చిత్తరంజన్‌దాస్ స్మారక సేవా సంస్థ నేతృత్వంలో సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు సనాతన ధర్మ వ్యాప్తికి విశేష కృషి చేస్తూ అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమ కో ఆర్డినేటర్ సోమరాజు రఘునాథ్, ప్రిన్సిపల్ కో ఆర్డినేటర్లు మిర్తిపాటి వెంకటరామయ్య, ఖండవల్లి సీతారాం, రామకృష్ణ, కేసీడీటీ సభ్యులు పాల్గొన్నారు.

వైభవుడి దివ్యక్షేత్రంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామి దివ్యక్షేత్రంలో శనివారం ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున గొల్ల సన్నిధి సేవ చేసి, సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకుడు శేషాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్టి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరిపారు. మధ్యాహ్నం 300 మంది భక్తులకు అన్నదానం చేశారు. భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని వైభవుడిని దర్శించుకున్నారు.

పక్కా ప్రణాళికతో వాకర్స్ క్లబ్ సేవలు



మాట్లాడుతున్న వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి

మురళీనగర్: పక్కా ప్రణాళికతో వాకర్స్ క్లబ్ సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నామని క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి తెలిపారు. మురళీనగర్ వాకర్స్ పార్కులో శనివారం నిర్వహించిన క్లబ్ వార్షిక సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్కు సుందరీకరణ, క్లబ్ ఆర్థికాభివృద్ధి, సేవా, సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాల వివరాలను సభ్యులకు వివరించారు. వాకర్స్ ఇంటర్నేషనల్ కార్యదర్శి కె.ద్వారకానాథ్ మాట్లాడుతూ డిసెంబరు 23, 24 తేదీల్లో విశాఖలో జరగనున్న వాకర్స్ ఇంటర్నేషనల్ వార్షిక సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యదర్శి ఎల్‌వీ సుధాకర్, కోశాధికారి జె.కూర్మారావు క్లబ్ వార్షిక నివేదికలు తెలిపారు. ప్రపంచ శాంతి కోసం రెండు నిమిషాలు మౌనం పాటించారు. వాకర్స్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకుడు సుంకరి ఆళ్వార్ దాస్ చిత్రపటానికి నివాళులర్పించారు. వాకర్స్ వాయిస్ నెలవారి పత్రికను పూర్వ అధ్యక్షుడు ఎం.భాస్కరరావు ఆవిష్కరించారు. వాకర్స్ క్లబ్ 2024 సంవత్సరానికి ఇటీవల నిర్వహించిన ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన కొత్త కార్యవర్గాన్ని ఎన్నికల అధికారి ఎస్.బుచ్చయ్య ఈ సమావేశంలో ప్రకటించారు.

అయ్యప్ప సన్నిధిలో మండల దీక్షల జోరు



పూజలందుకున్న అయ్యప్పస్వామి

పెందుర్తి: ఉత్తరాంధ్ర శబరిమలగా పేరుగాంచిన పెందుర్తిలోని అయ్యప్పస్వామి ఆలయంలో అయ్యప్ప భక్తులు భారీ ఎత్తున మండల దీక్షలు తీసుకున్నారు. శనివారం వేకువజాము నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గురుస్వామి రాము ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకుడు పొందూరు మణికంఠశర్మ చేతుల మీదుగా భక్తులకు మాలధారణ చేశారు. దాదాపు 200 మంది భక్తులు అయ్యప్ప దీక్ష స్వీకరించారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందసత్యనారాయణ దీక్ష స్వీకరించి పూజల్లో పాల్గొన్నారు. అనంతరం మహా అన్నదానాన్ని రాము గురుస్వామి ప్రారంభించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుతో రక్షణ



మాట్లాడుతున్న సీఐ ఇమ్మానుయేల్ రాజు

సీతమ్మధార: ద్వారకా క్రైం పోలీస్ స్టేషన్ పరిధి సీతమ్మధార, నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని హిల్‌వ్యూ పార్కులో శనివారం పార్కు అసోసియేషన్ ప్రెసిడెంట్ భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో సీసీ కెమెరాలపై సీఐ టి.ఇమ్మానుయేల్ రాజు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇంటి వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఒక కెమెరా వంద మంది పోలీసులతో సమానమన్నారు. నిఘా కెమెరాల ఏర్పాటు ద్వారా ఇళ్లు, కార్యాలయాలకు రక్షణతోపాటు గతంలో జరిగిన దొంగతనాలను సులువుగా ఛేదించవచ్చని పేర్కొన్నారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే తక్షణమే సంబంధిత పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. నగదు, బంగారు ఆభరణాలను బ్యాంక్‌లో భద్రపరుచుకోవాలని సూచించారు. ఊళ్లు, దూర ప్రాంతాలకు వెళ్లేటప్పుడు తాళాలు జాగ్రత్త పరచాలన్నారు. అపార్ట్‌మెంట్లలో రిజిస్టర్ బుక్ ఏర్పాటు చేసుకొని వచ్చిపోయే వారి వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో క్రైం ఎస్ఐ నిహార్ పాల్గొన్నారు.

అవినీతిపై ఫిర్యాదు చేస్తే వెంటనే చర్యలు

ఆనందపురం : అవినీతిపై ఫిర్యాదు చేస్తే అధికారులు వెంటనే చర్యలు తీసుకుంటారని గంభీరంలో గల ఎగుమతుల తనిఖీ ఏజెన్సీ ఇన్‌చార్జి ఏడీ సుధాంశు శేఖర్‌దాస్ చెప్పారు. విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని వెల్లంకిలో శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శేఖర్‌దాస్ మాట్లాడుతూ ప్రజలు వివిధ రకాలుగా మోసపోతుండడంతో కేంద్ర ప్రభుత్వం ప్రజలను చైతన్య పరచడానికి ఇలాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేస్తోందన్నారు. పౌరులు సమాజంలో అవినీతిని ప్రోత్సహించరాదన్నారు. సమాజంలోని ప్రతీ పౌరుడికి అవినీతిని ప్రశ్నించే హక్కు ఉందని, అలాంటి ఉల్లంఘనలు జరిగితే సమాచారమివ్వాలని కోరారు. కార్యక్రమంలో భారత ప్రభుత్వ వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.